క్లుప్తంగా

ఆధ్యాత్మికత మార్గంలో నడవాలి



ఆత్మకూర్: త్రైత్రసిద్ధాంత ప్రభోద సేవాసమితి ఆధ్వర్యంలో ఆత్మకూర్‌లో ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా కార్తీకమాసం, పౌర్ణమిని పురస్కరించుకుని ఆచార్య ప్రభోదానంద యోగీశ్వరుల సందేశాలను, భగవద్గీత శ్లోకాలను ఉచ్చరించారు. అలాగే త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో పెబ్బేరు, కొత్తకోట, మదిగట్ల ప్రభోదసేవాసమితి నిర్వాహకులు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేంద్ర, రవి, భక్తులు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత



వనపర్తి రూరల్: మండలంలోని చిమనగుంటపల్లికి చెందిన నరేందర్‌రెడ్డి సతీమణి సునీతకు మంజూరైన రూ.లక్ష ఎల్‌ఓసీని హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జ్ కేబీ నాయుడు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న సునీత మెరుగైన చికిత్స చేయించుకునేందుకు ప్రభుత్వ పరమైన ఆర్థికసాయం అందేలా చూడాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి విన్నవించడంతో ఆయన సానుకూలంగా స్పందించి ఎల్‌ఓసీని మంజూరు చేయించారన్నారు. ఎల్‌ఓసీని మంజూరు చేయించడంపై బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విశ్వబ్రాహ్మణులను అన్ని విధాలుగా ఆదుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేయాలని శ్రీవిరాట్ విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు డీకే విశ్వప్రకాష్‌ఆచారి కోరారు. ఆదివారం స్వర్ణకారులు, స్థానికులు నూతనంగా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన విశ్వప్రకాశ్‌ను సత్కరించారు. విశ్వబ్రాహ్మణ స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తాండూర్ కిషోర్, బాలు, అరుణ్, దివాకర్, నాగరాజు, శివకుమార్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



పాన్‌గల్: తమతో పాటు చదువుకొని అకాల మరణం పొందిన స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు చిన్ననాటి మిత్ర బృందం రూ.లక్ష పోగు చేసి ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని మల్లాయిపల్లికి చెందిన పస్పుల స్వామి ఇటీవల మృతి చెందాడు. అతడితో పాటు 2009–10 విద్యా సంవత్సరంలో చింతకుంట ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న చింతకుంట, మల్లాయిపల్లి, మల్లాయిపల్లితండా, చందాపూర్ గ్రామాల మిత్ర బృందం అందరూ కలిసి రూ.లక్ష జమ చేసి, నగదును మిత్రుడి ఇద్దరు కుమార్తెల పేర్ల మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు వారు పేర్కొన్నారు.

వెంకటాంపల్లిలో..



ఖిల్లాఘనపురం: కష్టాల్లో ఉన్న స్నేహితుడి కుటుంబానికి కలిసి చదువున్న స్నేహితులందరూ కలిసి ఆర్థికసాయం అందించారు. మండలంలోని వెంకటాంపల్లికి చెందిన కొండా బాలయ్య ఇటీవల పాముకాటుకు గురై మృతి చెందాడు. కుటుంబ యజమాని చనిపోవడంతో అతడి భార్యపిల్లలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2007–2008 విద్యా సంవత్సరంలో ఖిల్లాఘనపురం బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన మిత్రులందరూ కలిసి రూ.50 వేలు జమ చేసి మృతుడి కుమార్తె ధన్సిక పేరున డిపాజిట్ చేసి బాండును భార్యకు అందజేశారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, సురేందర్, రామాంజనేయులు, కొండ రామస్వామి, చిన్నయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లోనే అంగన్‌వాడీలు



ఖిల్లాఘనపురంలో అద్దెభవనంలో కొనసాగుతున్న మూడో అంగన్‌వాడీ కేంద్రం

- ఇరుకు గదులతో అవస్థలు
- పౌష్టికాహారం నిల్వ చేసేందుకు తప్పని తిప్పలు

ఖిల్లాఘనపురం: చిన్నారులకు పాఠశాలలు, చదువుపై ఆసక్తి కలిగించడం, సకాలంలో పౌష్టికాహారం అందించి వారి ఎదుగుదలను పెంపొందించేందుకుగాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 3 నుంచి ఆరేళ్ల లోపు చిన్నారుల కోసం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ పక్కా భవనాలు, టీచర్లు, ఆయాల లేమితో ఇబ్బందిగా మారింది. ఇరుకు అద్దె భవనాలు, ప్రభుత్వ భవనాల్లో కేంద్రాలను నిర్వహిస్తున్నారు. దీంతో టీచర్లు, చిన్నారులు ఇబ్బందులు పడుతూ పక్కా భవనాల కోసం ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. మండలంలో మొత్తం 46 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. వీటిలో ఇప్పటి వరకు 21 కేంద్రాలకు మాత్రమే పక్కా భవనాలు నిర్మించారు. 25 కేంద్రాలను ఆయా గ్రామాల్లో అద్దె, కమ్యూనిటీ భవనాలు తదితర ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నారు.

మండల వ్యాప్తంగా..

మండలంలోని మొత్తం కేంద్రాల్లో 3నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 986 మంది ఉన్నారు. 7 నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు 804 ఉండగా వీరికి ఇంటి వద్దే పౌష్టికాహారం అందిస్తున్నారు. అదేవిధంగా మండలంలో 233 మంది గర్భిణులు, 258 మంది బాలింతలు ఉండగా వీరికి ఒక పూట సంపూర్ణ భోజనం వడ్డిస్తారు. కేంద్రాలను ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తుండటంతో ఇళ్ల వారు, గ్రామ పెద్దలు ఎప్పుడు ఖాళీ చేయమంటే అప్పుడు ఖాళీ చేసి వేరే ఇల్లు వెతుక్కోవాల్సి వస్తుంది. ఇలా సంవత్సరానికో ఇంట్లో కేంద్రాలను నిర్వహించడం వలన టీచర్లు, ఆయాలతో పాటు పిల్లలను కేంద్రాలకు పంపడానికి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు.

4 కేంద్రాల్లో టీచర్లు, 17 కేంద్రాల్లో ఆయాల పోస్టులు ఖాళీ

కర్నెతండా సెంటర్‌తో పాటు నడిమితండా, అల్లమాయపల్లి, ఆముదంబండతండాల అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు లేక చిన్నారులు, ఆయాలు ఇబ్బంది పడుతున్నారు. కర్నెతండా, మల్కిమియాన్‌పల్లి, తిర్మలాయపల్లి, వెనికితండా, మానాజీపేట–1, రోడ్డుమీదితండా, ఖిల్లాఘనపురం–1, కమాలోద్దీన్‌పూర్–1, అప్పారెడ్డిపల్లి–1, హీర్లతండా, అముదంబండతండా, గార్లబండ తండా, కొత్తపల్లి తండా, కుంటముందలి తండా, మల్కాపురం, షాపురంతండా, నడిమితండాలో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఉన్నతాధికారులకు నివేదించాం



మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలు, టీచర్ల ఖాళీలు, పక్కా భవనాలు లేని కేంద్రాల వివరాలను ఉన్నతాధికారులకు వివరించాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే భవనాలు నిర్మించేందుకు సంబంధిత అధికారులు చొరవ తీసుకుంటారు.

– ఈదమ్మ,
అంగన్‌వాడీ సూపర్‌వైజర్, ఖిల్లాఘనపురం

అద్దె భవనంలోనే..



మండల కేంద్రంలో 3వ అంగన్‌వాడీ కేంద్రాన్ని సుమారు 17ఏళ్లుగా అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నాం. ఇంటి వారు ఎప్పుడు ఖాళీ చేయమంటే అప్పుడు ఖాళీ చేసి వేరే ఇల్లు చూసుకోవాలి. ప్రభుత్వం ఇచ్చే రూ.వెయ్యి అద్దె సరిపోవడం లేదని ఎక్కువగా అడుగుతున్నారు. ప్రభుత్వం పక్కా భవనం కట్టిస్తే పయోగంగా ఉంటుంది.

– కవిత, అంగన్‌వాడీ టీచర్, ఖిల్లాఘనపురం

ఆయా లేక ఇబ్బంది



అంగన్‌వాడీ కేంద్రానికి ఆయా లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. ఇంటింటికీ తిరిగి నేనే పిల్లలను సెంటర్‌కు తీసుకురావడంతో పాటు కేంద్రాన్ని శుభ్రం చేసుకోవాలి. అన్ని పనులు చూసుకోవడానికి ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం వెంటనే ఆయాను నియమించాలి.

–సరోజ,
అంగన్‌వాడీ టీచర్, ఖిల్లాఘనపురం–1

కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యేనా?



పాన్‌గల్ కొనుగోలు కేంద్రంలో ప్రైవేట్ వ్యాపారుల ధాన్యం కాంటా చేస్తున్న హమాలీలు

పాన్‌గల్: మద్దతు ధర కోసం రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని చెబుతున్నా.. దానికి అనుగుణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చినా కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. మద్దతు ధర లభిస్తుందనే నమ్మకంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొస్తున్నా నేటికీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో చాలా మంది రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. సాగు చేసిన వరి పంటల కోతలు ప్రారంభమై ధాన్యం కేంద్రాల్లో నిల్వ చేశారు. నిల్వ చేసిన ధాన్యాన్ని కాపాడుకోవడం రైతులకు తలకు మించిన భారం అవుతోంది. టార్పాలిన్ కవర్లు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద ఒక్కో పట్టాకు (కవర్లు)రూ. 30 పైగా అద్దె చెల్లిస్తున్నారు. మండలంలో ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో మాత్రం ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదని రైతులు వాపోతున్నారు. దీంతో తప్పని పరిస్థితుల్లో కొనుగోలు కేంద్రాల్లో అరబెట్టిన ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులు వచ్చి కాంటా చేస్తూ కొనుగోలు చేస్తున్నా కూడా ప్రజాప్రతినిధులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం లేదు. ఆదివారం ప్రైవేట్ వ్యాపారి కొనుగోలు కేంద్రం వద్దనే రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ప్రైవేట్ వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేయకుండా అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

రైల్వే ఉద్యోగాల్లో తెలంగాణకు అన్యాయం



మాట్లాడుతున్న కుతుబ్

అమరచింత: రైల్వే ఉద్యోగాల భర్తీలో కేంద్ర ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల యువతకు తీవ్ర అన్యాయం చేస్తుందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ అన్నారు. మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యున్నత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ లాంటి ఉద్యోగాల భర్తీకే 13 ప్రాంతీయ భాషల్లో రాత పరీక్షలు నిర్వహిస్తుంటే.. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డుల ద్వారా భర్తీ చేసే ఉద్యోగాలకు మాత్రం కేవలం ఇంగ్లిష్, హిందీ భాషల్లోనే పరీక్షలు నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. ఇంగ్లిష్, హిందీ భాషల్లో పరీక్షలను నిర్వహించడం ద్వారా కేవలం ఉత్తర భారతదేశంలోని రాష్ట్రాల వారికే రైల్వే ఉద్యోగాలు వస్తున్నాయని, తెలుగు రాష్ట్రాల యువతకు మొండి చేయి చూపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డును ప్రక్షాళన చేసి అన్ని రాష్ట్రాల ప్రాంతీయ భాషల్లో పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో రవి, రాము, ఉదయ్, కిరణ్, మైబు, చంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతుకు రైతుల చేయూత



ప్రొక్లెయిన్‌తో రహదారి మరమ్మతు చేయిస్తున్న రైతులు

అమరచింత: గుంతలమయంగా మారిన రహదారికి మరమ్మతు చేసేందుకు అధికారులు చొరవ తీసుకోవడం లేదని కిష్టంపల్లి, ఈర్లదిన్నె, మిట్టనందిమళ్ల గ్రామాలకు చెందిన రైతులు సొంతంగా ఖర్చులు భరిస్తూ రహదారి మరమ్మతు పనులు ఆదివారం ప్రారంభించారు. మండలంలోని కిష్టంపల్లి నుంచి మిట్టనందిమళ్ల వరకు ఉన్న బీటీ రహదారి పూర్తిగా గుంతలమయం కావడంతో వరి ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించడంలో ఇబ్బందులు పడుతున్నామని రైతులు పలుమార్లు ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నారు. గత ప్రభుత్వంలోనే బీటీ రహదారి బాగుపడుతుందని ఆశ పడిన వారికి నిరాశే మిగిలింది. ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ వాకిటి శ్రీహరికి సైతం రహదారి మరమ్మతుకు సహకరించాలని కోరినా ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదని రైతులు తెలిపారు. ప్రస్తుతం వరి, చెరుకు కోతలు మొదలవ్వడంతో పంటలను తరలించేందుకు రైతులే సొంతంగా డబ్బులు ఖర్చుపెట్టి జేసీబీ సహాయంతో గుంతలు పూడ్చారు. కార్యక్రమంలో రైతులు మల్లారెడ్డి, వెంకట్రాములు, నరేందర్, తిరుపతి, రాజు, ఆనంద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మ రక్షణకు సిద్ధం కావాలి



రక్తదాతలను అభినందిస్తున్న ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ధర్మ రక్షణకు భజరంగ్‌దళ్ కార్యకర్తలు సిద్ధం కావాలని ఆసంస్థ రాష్ట్ర సహ సంయోజక్ వెంకటేశ్ అన్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం జరిగిన కరసేవలో ప్రాణాలర్పించిన వారిని స్మరిస్తూ ఆదివారం హుతాత్మ దివాస్‌ను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వెంకటేశ్ పాల్గొని మాట్లాడారు. భజరంగ్‌దళ్ కార్యకర్తలు ప్రాణాలకు తెగించి గోవులను కాపాడుతున్నట్లు తెలిపారు. రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ సమాజ సేవ చేస్తున్నారన్నారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి మాట్లాడుతూ ప్రతి బస్తీలో భజరంగ్‌దళ్ టీమ్‌లు ఏర్పాటుచేసి కార్యకర్తలను సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ రాష్ట్ర గోరక్ష ప్రముఖ్ టి.సురేష్‌బాబు, చాపల హన్మంతు, రాచాల జనార్దన్, జిల్లా సంయోజక్ వంశీ, సహ సంయోజక్ కుమార్, నగర సంయోజక్ ఛత్రపతి, శ్రావణ్, జయంత్, అయ్యప్ప, సంపత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



వీపనగండ్లలో ఓటరు నమోదు దరఖాస్తులను పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి

పాన్‌గల్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, డీటీ అశోక్‌నాయుడు సూచించారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో తహసీల్దార్, జమ్మాపూర్, బహదూర్‌గూడెం గ్రామాల్లో డీటీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. బీఎల్‌ఓలు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన చేశాకే వాటిని స్వీకరించాలని వారు సూచించారు. కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండే విధంగా బీఎల్‌ఓలు అవగాహన కల్పించి వారితో దరఖాస్తులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు మహేష్, తిరుపతయ్య, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

అమరచింత: అర్హులైన యువత విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రవికుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో బీఎల్‌ఓలు తమ బూత్‌ల వద్ద ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీటీ రెడ్యానాయక్, ఆర్‌ఐ గోపాల్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: అర్హులైన యువతీయువకులను నూతన ఓటర్లుగా నమోదు చేయడంతో పాటు ఓటరు జాబితాలో తప్పులు దొర్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత బీఎల్‌ఓలదేనని ఇన్‌చార్జ్ తహసీల్దార్ కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటు నమోదు క్యాంపును ఆయన సందర్శించారు. మరణించిన, వివాహం జరిగిన ఓటర్లను తొలగించాలనుకున్నప్పుడు వారి కుటుంబ సభ్యుల ముందస్తు అనుమతులు తీసుకోవాలని ఆయన బీఎల్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కృష్ణమూర్తి, జూనియర్ అసిస్టెంట్ రవి, బీఎల్‌ఓలు సుగుణాబాయి, సువర్ణ, ఎల్లమ్మ, మహేశ్వరి పాల్గొన్నారు.



పాన్‌గల్ మండలం జమ్మాపూర్‌లో..

జాతరకు తగ్గిన భక్తులు

పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు భక్తులు తక్కువ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వ్యవసాయ పనులతో పాటు కార్తీకమాసం కారణంగా 4 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

ఆలయ నిర్మాణానికి సహకరించండి



అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నిర్వాహకులు

ఆత్మకూర్: శ్రీశ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి నూతన ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ విరాళాలు అందించి సంపూర్ణంగా సహకరించాలని మాజీ ఎంపీపీ డాక్టర్ మొగిలి శ్రీధర్‌గౌడ్, గాడీ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక అయ్యప్ప కాలనీలో రూ. 3 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణానికి ఇది వరకే రూ.2 కోట్లు ఖర్చు అయ్యిందని, ఇంకా రూ.కోటి నిధులను విరాళాల రూపంలో అందిస్తే నిర్మాణ పనులు త్వరగా పూర్తవుతాయన్నారు. ఈ నెల చివరి నాటికి ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని, డిసెంబర్ రెండో వారంలో విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆలయంలో దీక్షాపరులకు ప్రతినిత్యం భిక్ష అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే విరాళాలు ఇవ్వాల్సిన భక్తులు ఆలయ కమిటీ నిర్వాహకులకు నేరుగా లేదా ఫోన్‌పే 94411 61898 నంబర్‌కు డబ్బు పంపించాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు జిన్నారం శ్రీను, కూరగాయల రఘు, దివాకర్, భరత్, కొత్తబోయ శేఖర్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే



మోజర్లలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సద్గుణ

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా ఎన్యూమరేటర్లు పూర్తి వివరాలు నమోదు చేయాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి బీరం సుబ్బారెడ్డి, తహసీల్దార్ చాంద్‌పాష, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలో సమగ్ర కుటుంబసర్వే నమోదు ప్రక్రియను అధికారులు పరిశీలించారు.

కొత్తకోట రూరల్: మండలంలోని 24గ్రామాల్లో ఎన్యూమరేటర్లకు తమకు కేటాయించిన బ్లాక్‌లో సర్వేను నిర్వహిస్తున్నారు. ఎంపీడీఓ చెన్నమ్మ పాలెం గ్రామంలో సర్వే తీరును పరిశీలించారు. మండలంలో రెండు రోజులుగా 1,300 ఇళ్లకు పైగా సర్వే చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

పెద్దమందడి మండలంలో..

పెద్దమందడి మండలంలోని 22 గ్రామాల్లో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతుంది. మండలంలో దాదాపు 80మందికి పైగా ఎన్యూమరేటర్లు విధుల్లో ఉండగా.. దాదాపు 1,200 ఇళ్లకు పైగా సర్వే చేసినట్లు ఎంపీడీఓ సద్గుణ తెలిపారు.

అమరచింత: మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మున్సిపాలిటీలోని వివిధ బ్లాక్‌ల్లో ఎన్యూమరేటర్లు చేస్తున్న సర్వేను తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ రెడ్యానాయక్, ఆర్‌ఐ గోపాల్, ఎంపీఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: మండలంలోని నాచహళ్లిలో నిర్వహిస్తున్న కుటుంబ సర్వేను ఆదివారం ఆర్డీఓ, మండల ప్రత్యేకాధికారి సుబ్రమణ్యం పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరును పరిశీలించి కుటుంబ వివరాల నమోదును జాగ్రత్తగా నమోదు చేయాలని ఆయన ఎన్యూమరేటర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాఘవ, పంచాయతీ కార్యదర్శి నూతన్ పాల్గొన్నారు.

పాన్‌గల్: ఇంటింటి కుటుంబ సర్వే మార్గదర్శకాలను ప్రజలకు తెలుపుతూ సర్వేను బాధ్యతగా నిర్వహించాలని ఎంపీడీఓ గోవింద్‌రావు, తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి ఎన్యూమరేటర్లకు సూచించారు. సర్వే రెండో రోజు తహసీల్దార్ పాన్‌గల్‌లో, ఎంపీడీఓ బండపల్లిలో, బహదూర్‌గూడెం, కేతేపల్లి, తెల్లరాళ్లపల్లితండా గ్రామాలల్లో పర్యటించి ఇంటింటి సర్వే పత్రాలను పరిశీలించారు. మండలంలోని 28 జీపీల్లో 807 ఇళ్ల నుంచి వివరాలను సేకరించినట్లు వారు పేర్కొన్నారు.

ఖిల్లాఘనపురం: ఎన్యూమరేటర్లకు ప్రజల నుంచి సమస్యలు ఎదురవుతుండటంతో ఒక్కో ఇంటి వద్ద కనీసం 30 నిమిషాల నుంచి గంట సమయం పడుతుందని చెప్పారు. మండలంలో మొత్తం 10,140 ఇళ్లను గుర్తించగా.. శనివారం 526 ఇళ్లు మాత్రమే సర్వే చేయగా ఆదివారం 782 ఇళ్లలో సర్వే చేశారు.



బండపల్లిలో ..




పాలెంలో..



అమరచింతలో..

సీపీఎం బైక్ ర్యాలీ



వనపర్తి అంబేడ్కర్ చౌరస్తాలో ర్యాలీ ప్రారంభిస్తున్న పుట్టా ఆంజనేయులు

వనపర్తి రూరల్: వీపనగండ్ల మండలంలో ఆదివారం నిర్వహించిన సీపీఎం జిల్లా మూడో మహాసభలకు వనపర్తి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సీపీఎం నాయకులు, కార్యకర్తలు, కార్మికులు భారీగా తరలివెళ్లారు. వారు చేపట్టిన మోటారు సైకిల్ యాత్రను అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని రాజీవ్‌చౌక్, కొత్తబస్టాండ్ మీదుగా భారీ ప్రదర్శనతో ర్యాలీ వీపనగండ్లకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పరమేశ్వరచారి, కురుమయ్య, బాలస్వామి, రమేష్, కృష్ణ, గంధం మదన్, గంధం గట్టయ్య, బీసన్న తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: జిల్లాలోని వీపనగండ్లలో ఆదివారం నిర్వహించిన జిల్లా మూడో మహాసభల్లో పాల్గొనేందుకు సీపీఎం మండల కార్యదర్శి జీఎస్.గోపి ఆధ్వర్యంలో మండలం నుంచి సీపీఎం నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మహమూద్, వెంకటేష్, రాజు, రమేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



గోపాల్‌పేట: మండలంలోని తాడిపర్తికి చెందిన రాఘవేందర్‌గౌడ్ శనివారం కర్ణాటక రాష్ట్రంలోని గణగాపూర్ దత్తాత్రేయ క్షేత్ర దర్శనం కోసం వెళ్లాడు. ఈ క్రమంలో కర్ణాటక రాష్ట్రంలోని కమలాపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మరణించగా.. మృతదేహాన్ని ఆదివారం సొంత గ్రామం తాడిపర్తికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించాడు. వారి కుటుంబానికి అండగా ఉంటామని ప్రభుత్వపరంగా చేయాల్సిన సాయం అందిస్తామని చెప్పారు.